# దెయ్యం

కె.దొరైరాజు

నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఎండుటాకు కదలికకే ఉలిక్కిపడుతున్నారు. సైగలు చేసుకోవడమే తప్ప నోరువిప్పి మాట్లాడడానికి సాహసించడం లేదు. పొద్దుననగా మేతకు వెళ్ళిన పశువులు గిట్టలతో దుమ్మురేపుకుంటూ ఇళ్ళకొస్తున్నాయి. బయట పనులు ముగించుకుని ఇళ్ళకొస్తున్న వాళ్ళు అక్కడ గుమిగూడిన జనాన్ని చూసి ఏం జరిగిందోనన్న కుతూహలంతో గుంపులో ఒకరైపోతున్నారు.

''సుబ్బన్నను దెయ్యం తొక్కిందంట. మాట పడిపోయి మనిషి కళదప్పి పొయ్యుండాడంట'' నోరు విప్పారెవరో. గుసగుసలు మొదలయ్యాయి. ఎవరికి తోచింది వారు మాట్లాడుకుంటున్నారు. ఇది ఆ సాయంత్రం సుబ్బడి ఇంటిముందు కనిపించిన దృశ్యం!

సుబ్బడి ఇంటి వసారాలో ఓ స్తంభానికి నడుం ఆనించి ఈ విషయాలేవీ తనకు తెలియనట్లు, ఆ దృశ్యంతో తనకేం సంబంధం లేనట్లు కళ్ళు మూసుకుని దీర్ఘంగా ఆలోచిస్తూ నిలబడి వుంది – ఆ దృశ్యానికి కేంద్ర బిందువు శాంత.

శాంత, ఓ అందమైన అమ్మాయి. అందంతోపాటు ఆకర్షణ, అణకువ కలిగిన అమ్మాయి. పుట్టుకతోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆ ఊరికి రెండు మైళ్ళ దూరంలో వున్న కొత్తపల్లెమిట్టలో ప్రతి ఆదివారం జరిగే సంతకు అన్నయ్యతోపాటు కలిసి వెళ్ళి మట్టి కుండలు, బొమ్మలు అమ్ముకుని ఇంటికి కావలసిన సరుకులు కొను



క్కుని, అక్కడే టూరింగ్ టాకీసులో సినిమా చూసుకుని ఇంటికి రావడం ఆమె అలవాటు. ఆ వూళ్ళో సుబ్బడు ఒక మగాడు.

శాంత లంగా ఓణీ స్థాయి దాటి ఇప్పుడిప్పుడే చీరలు కట్టడం మొదలుపెట్టింది. ఆమె అందం సుబ్బడిని పిచ్చివాణ్ణి చేసింది. ఎలాగైనా శాంతను పొందాలన్న కోరిక సుబ్బడిలో రోజురోజుకూ పెరిగి అతణ్ణి నిద్రహారాలకు దూరం చేస్తోంది. చాలా సార్లు మాటామాటా కలిపి చూశాడు. ఆమెకేమీ అర్థం కాలేదు. ఊ హుఁ... లాభం లేదు, ఇక డైరెక్ట్‌గా రంగంలోకి దిగాల్సిందేనని నిర్ణయించుకుని తగిన సమయంకోసం ఎదురుచూస్తున్నాడు.

ఆరోజు ఆదివారం. మండే ఎండను లెక్కచేయకుండా కుండలు మోసుకుని సంతకు బయలుదేరింది శాంత. కాలిబాటలో వెళితే కొత్తపల్లిమిట్ట ఒక మైలుదూరం వుంటుంది. ఊరు దాటి, చెరువు దాటితే పంటపొలాలున్నాయి. వాటిని దాటితే మామిడితోపు, చిన్నచిన్న నీటికాలువలు...

తన పొలంలో పని చేసుకుంటున్నవాడల్లా వొంటరిగా కుండలు మోసుకువెళుతున్న శాంతను చూశాడు సుబ్బడు. ఇదే మంచి సమయమనుకుని చేసే పనిని విడిచిపెట్టి శాంతను అనుసరించాడు. ముందు శాంత, వెనక సుబ్బడు. ఇద్దరిమధ్యా దాదాపు పాతిక అడుగుల దూరం. నడక వేగం పెంచాడు సుబ్బడు. దూరం తగ్గింది. ఇప్పుడు సుబ్బడు, శాంత పక్కపక్కనే నడుస్తున్నారు. ''ఏంటే శాంతా! ఒంటరిగా కుండలు మోసుకుపోతున్నావు. మీ అన్న లేడా!'' అంటూ మాట కలిపాడు.

అంతవరకూ సుబ్బడి రాకను గమనించని శాంత ''నువ్వా, సుబ్బన్నా, మాయన్న తిరపతికి బొయ్యినాడు. నేరుగా సంతకే వస్తానని జెప్పి నన్ను కుండలు తెమ్మన్నాడు'' అంది శాంత.

మామిడి తోపు దగ్గరకొచ్చాక ''ఈ పొద్దెందుకో ఎండ అదరగొడ్తా ఉంది. కొంచెం బరువు దించు సుబ్బన్నా'' అంటూ కుండల మోపు దించమని సుబ్బడివైపు తిరిగింది శాంత. కుండల మోపు దించాడు.

ముఖానికి పట్టిన చెమట పైటకొంగుతో తుడుచుకుంటూ ''నువ్వెళ్ళు సుబ్బన్నా, నీతో కుండలు దింపించినానని మాయన్నకు దెలిస్తే నన్ను ఉతికేస్తాడు'' అంది భయపడుతూ.

''ఫరవాలేదులేవే నేను గూడా సంతకే వస్తున్నాను. నేను చెపుతాలే'' అన్నాడు ధైర్యం చెపుతున్నట్లు.

నీళ్ళు దప్పికగా వుండి, ''నీళ్ళు తాగివస్తా, గొడ్డూగోదా తొక్కెయ్యకుండా ఈ కుండలు సూసుకో సుబ్బన్నా'' అంటూ దగ్గర్లోని కాలువ దగ్గరకు వెళ్ళి కూర్చుని నీళ్ళు తాగుతోంది శాంత.

అటూ ఇటూ చూశాడు సుబ్బడు. ఎవరూ రావడంలేదు. శాంత అటుతిరిగి కూర్చుని నీళ్ళు తాగుతోంది. తనను చూసే అవకాశం లేదు. కొంచెం ఆలస్యం చేస్తే జనసంచారం పెరుగుతుంది. ఈ అవకాశం వదులుకోకూడదని నిర్ణయించుకుని శబ్దం చేయకుండా వెళ్ళి వెనుకవైపు నుంచి శాంతను గట్టిగా వాటేసుకున్నాడు సుబ్బడు. ఈ హఠాత్పరిణామాన్ని ఊహించని శాంత ''అన్నా సుబ్బన్నా ఎవుడో దొంగెదవ పట్టుకున్నాడు. నువ్వు రాన్నా!'' అంటూ అరిచింది పెనుగులాడుతూ.

''ఊరికే అరవద్దే. ఇక్కడెవురూ లేరు'' అంటూ గట్టిగా పట్టుకుని పక్కనే వున్న జొన్న చేలు దాటి, బీడు భూముల మీదుగా లాక్కుపోతున్నాడు. శాంత ఎంత పెనుగులాడినా సుబ్బడి బలం ముందు ఆమె బలం సరిపోవడం లేదు. చెరువు మొరవ నీళ్ళు పారే వొంక దగ్గరకు లాక్కొచ్చేశాడు. మొండి ధైర్యం తెచ్చుకుని తనను గట్టిగా వాటేసిన సుబ్బడి చేతిని కసిగా కొరికింది. ఆ నొప్పి తట్టుకోలేక అమ్మా.. అంటూ అరుస్తూ రెండు చేతులూ వదిలేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని శివంగిలా తిరగబడింది శాంత. పట్టుతప్పి కిందపడ్డాడు సుబ్బడు.

''మిడిమాళెపెదవా, మిన్నూ మన్నూ తెలీక నామిందబడతావా - నిన్నూ...'' అంటూ పక్కనే చేతికందిన రాళ్ళను తీసుకుని ఆవేశంగా, బలంగా సుబ్బడిపైకి వేస్తోంది శాంత. ఈ క్రమంలో జుట్టు ముడి వీడిపోయి, ముఖంమీద పట్టిన చెమటకు కుంకుమ బొట్టు చెదరడంతోబాటు ఆవేశంగా ఊగిపోతూ మహిషాసురమర్దినిలా కనిపించిన శాంతను చూసి సుబ్బడి మతి భ్రమించినంతపనైంది. ఆవేశం తగ్గేదాకా చేతికి దొరికిన రాళ్ళు రప్పలను సుబ్బడిపైకి విసిరింది. ఆవేశం తగ్గాక చలనం లేకుండా పడిపోయిన సుబ్బడి ముక్కు దగ్గర చేయి పెట్టి చూసి సుబ్బడు బతికే వున్నాడని నిర్ణయించుకున్నాక పడుతూ లేస్తూ పరుగుతీస్తూ అక్కడనుంచి ఊర్లోకొచ్చేసింది శాంత.

జుట్టు ముడి వీడిపోయి, ముఖంమీద పట్టిన చెమటకు కుంకుమ బొట్టు చెదరడంతో బాటు ఆవేశంగా ఊగిపోతూ మహిషాసుర మర్దినిలా కనిపించిన శాంతను చూసి సుబ్బడి మతి భ్రమించినంతపనైంది. ఆవేశం తగ్గేదాకా చేతికి దొరికిన రాళ్ళు రప్పలను సుబ్బడిపైకి విసిరింది.

***

''శాంతమ్మా... శాంతమ్మా...'' అరుపులాంటి ఆ పిలుపుతో ఆలోచనల నుంచి తేరుకుంది శాంత. జరిగిన సంఘటన గుర్తొచ్చి గగుర్పాటు, భయంతోనూ చెమటలు పట్టేసి, శ్వాస వేగం పెరిగింది. ఇక నిలబడలేనట్లు ఆ స్తంభానికే జారగిలబడింది.

''బాగా భయపడినట్లున్నావు శాంతమ్మా, భయపడకుండా అసలేం జరిగిందో వివరంగా చెప్పు'' అంటున్నాడు ఇందాక మాట్లాడిన పెద్దాయన.

''రేయ్ విషయం తెలియకుండా ఎవురికివాడు నోటికొచ్చినట్లు మాట్లాడొద్దు. ఈ విషయం అందరి కంటె ముందు ఊర్లోకి తీసుకొచ్చింది శాంతమ్మ. ఆమెను జెప్పనీయండి'' అన్నాడు ఏడుస్తున్న సుబ్బడి భార్యను ఓదారుస్తూ ఆ పెద్దాయన. అందరూ శాంతవైపే చూస్తున్నారు. అందరిలోనూ శాంత ఏం చెప్తుందోనన్న ఆతృత.

గుండె దిటవు చేసుకుని, ఏదో నిర్ణయానికొచ్చినదానిలా పెద్దాయన్ను ఉద్దేశిస్తూ, ''అయ్యా! ఈ పొద్దు మధ్యాన్నం నేను కుండలు మోసుకుని సంతకుపోతూంటిని. మామిడి తోపు దగ్గరికి బొయ్యేటప్పటికి ఎండకు తట్టుకోలేక నీళ్ళు దప్పికేసింది. అక్కడే వున్న సుబ్బన్న వొచ్చి నెత్తిమీద కుండలు దింపినాడు. నేను నీళ్ళు తాగుదామని కాలవ దగ్గరికి పోయి ముఖం కడుక్కుని నీళ్ళు తాగుతుంటే, మొరవ వొంకలోకి నుండి ఒకటే అరుపులు వినిపించినాయి. సుబ్బన్న ఉన్నాడేమోనని చూస్తే అన్న అక్కడలేడు. నిదానించి వింటే అది సుబ్బన్న గొంతుమాదిరి అనిపించింది. ధైర్యంచేసి దగ్గరికిపోతిని. అక్కడ వొంకలో సుబ్బన్న పడిపొయ్యుండాడు. పది అడుగుల దూరంలో తెల్ల ఆంబోతు బుసలుకొడతా, ముందరి కాళ్ళతో నేల గీరతా ఉంది. చేతికందిన రాళ్ళు తీసుకుని ఆంబోతు మీదికి వేసినా. అది పారిపోతుందనుకుంటే రాళ్ళు వొంటి మీద పడేటప్పటికి బుసలుకొడుతూ నా మీదికి రాబోయింది. నాకు భయమేసి పడుతూ లేస్తూ ఊర్లోకొచ్చి సుబ్బన్న పెళ్ళానికి జెప్పినా'' అంటూ ముగించి కడుపులో నుంచి ఎగదన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ పైటకొంగుతో కళ్ళు తుడుచుకుని, ముక్కు చీదుకుంటూ తనకు తగిలిన గాయాలను చూపించింది.

అంతా విని ''ఆ గిత్త ఎవురిదిరా!'' అన్నాడు.

''కొత్తోళ్ళ భాస్కరుడిది మావాఁ...'' ఆ గుంపు లోనుంచి సమాధానం.

''భాస్కరుడు రాలేదా! సరే, దాని ముక్కుకు తాడేసి పగ్గం పట్టుకుని మేపమని జెప్పమనండి. ఇట్లా ఊరిమీద వొదిలేస్తే అది మనుషుల్ని బతకనీయదు. అదృష్టం బాగుండబట్టి శాంతమ్మ జూసి ఊర్లో చెప్పింది. మనం పోయి సుబ్బడ్ని బతికించుకుంటిమి. లేదంటే సుబ్బడి బతుకేమయ్యుండాల'' అన్నాడు శాంతవైపు కృతజ్ఞతగా చూస్తూ.

అక్కడ గుమిగూడిన వాళ్ళంతా రకరకాలుగా మాట్లాడుకుని సుబ్బడ్ని దెయ్యం తొక్కనందుకు నిరాశపడుతూ చివరికి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కళ్ళొత్తుకుంటూ కృతజ్ఞతగా శాంతవైపు చూసింది సుబ్బడి భార్య.

సుబ్బడి ముఖంలో నెత్తుటిచుక్క లేదు. ఆ చూపులు నిర్లిప్తంగా, ఆకాశంవైపు తదేకంగా చూస్తున్నాయి. సుబ్బడి నోటినుంచి మాట రావడంలేదు. మాట పడిపోయిందో, లేక మాట్లాడితే విషయం బయటపడుతుందని తనే మాట్లాడడం లేదో సుబ్బడికే తెలియాలి.

★